క్లుప్తంగా

గడువు లోపు ఫీజు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాయం డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ –1 సంబంధించిన పరీక్ష ఫీజు మే 6వ తేదీ లోపు చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు, అభ్యాసక సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నాగోజీలు తెలిపారు. బీఏ, బీకాం విద్యార్థులు పేపరుకు రూ.150 చొప్పున చెల్లించాలన్నారు. బీఎస్సీ కంప్యూటర్ విద్యార్థులు పేపరుకు రూ.150, ప్రాక్టికల్స్ పరీక్షలకు అదనంగా రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెమిస్టర్–2 పరీక్షలు మే26 నుంచి జూన్ 1వ తేదీ వరకూ జరుగుతాయన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చిలుక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో సాయంత్రం 4గంటలకు వేలాది మందితో భారీ ఎత్తున నామినేషన్ వేయనున్నట్లు చెప్పారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరుకానున్నరని చెప్పారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా కదలిరావాలన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షిక ఉత్సవాలు



ఆకుతోటపల్లిలో బొడ్రాయికి పూజలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: ఆకుతోటపల్లి గ్రామంలో బొడ్రాయి వార్షిక ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆకుతోటపల్లి గ్రామంలోని బొడ్రాయిని పూలతో శోభాయమానంగా అలంకరించారు. బొడ్రాయి వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రజిత, ఎంపీటీసీ నిట్టి మంగమ్మ, మాజీ వైస్‌ఎంపీపీ నిట్టి నారాయణ, స్థానిక నాయకులు నర్సింహ, సత్యం, రాజు, మల్లేశ్, శేఖర్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల తనిఖీ



చుక్కాపూర్‌లో రోడ్లను పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను తనిఖీ నిర్వహించారు. ఎస్ఎస్ఏటీ అధికారి ఎస్ఆర్‌పీ కాశన్న, పీఆర్ఏఈ విద్యాసాగర్‌తో కలిసి సామాజిక తనిఖీ నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో–5 రోడ్లు, గట్టుఇప్పలపల్లి–2, బద్నాపూర్‌లో–1 తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా ఇసుక, సిమెంట్, కాంక్రీట్‌లను సమ పాళ్లలో వేశారా? లేదా? అని పరిశీలించారు. పొడువు, వెడల్పు, మందంలను టేపుతో కొలతలు వేసి సరిచూసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయని గమనించారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులను చక్కదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఒక ఎత్తు అయితే పిల్లల తల్లిదండ్రులు వారి బాగోగులు చూసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. శనివారం ఎన్కెపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో విద్య పూర్తి చేసిన విద్యార్థులకు వీడ్కోలు, గ్రాడ్యుయేషన్ డేను అంగన్‌వాడీ టీచర్ అరుణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగమణి పాల్గొని విద్యార్థులకు అంగన్‌వాడీలో పూర్తి చేసిన సర్టిఫికెట్లు, గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించడం ఇక్కడ చూడడం మొదటి సారి అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషమని పేర్కొన్నారు. ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను పిల్లలతో పాటు తల్లిదండ్రులకు అందజేశారు.

నిద్దరోతున్న నిఘా నేత్రాలు

గ్రామాల్లో పనిచేయని సీసీకెమెరాలు
- సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో నిర్వహణ గాలికి
- పెరుగుతున్న నేరాలు

మొయినాబాద్: నేరాల సంఖ్యను తగ్గించాలని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) నిద్రపోతున్నాయి. పట్టణాలు, గ్రామాలు తేడా లేకుండా చాలాచోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ప్రధానంగా పోలీసుల ప్రోద్బలంతో మండలంలో షాపుల యజమానులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 1న ముగియడంతో సీసీ కెమెరాల నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ కెమెరాల వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా మూలనపడడంతో నేరాలు పెరుగుతున్నాయి.

నిర్వహణ గాలికి..

మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాగా గ్రామ పంచాయతీల్లో ఐదేళ్ల క్రితం సర్పంచ్‌లు దాతల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్క గ్రామంలో 12 నుంచి 32 కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించిన హార్డ్‌డిస్క్, స్క్రీన్‌ను గ్రామ పంచాయతీల్లో పెట్టారు. సర్పంచ్‌లు పదవిలో ఉన్నంతకాలం సీసీ కెమెరాల నిర్వహణను స్వయంగా నిర్వహించారు. అయితే ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. సీసీ కెమెరాల నిర్వహణకు పంచాయతీల నుంచి నిధులు ఇవ్వలేమని ప్రత్యేక అధికారులు చెప్పి వాటి నిర్వహణ గాలికొదిలేశారు.

పనిచేయని కెమెరాలు

మండలంలోని చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు సరిగా పనిచేయడంలేదు. మొయినాబాద్, సురంగల్, వెంకటాపూర్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, తోలుకట్ట, అమ్డాపూర్, కాశీంబౌలి, రెడ్డిపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, చందానగర్, చిలుకూరు, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఆయా గ్రామాల్లో కొంతమంది సొంతంగా ఇళ్లు, షాపులు, ఫాంహౌస్‌లలో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు మాత్రం అక్కడక్కడ పని చేస్తున్నాయి.



పనిచేయని సీసీ కెమెరా



సురంగల్ గ్రామ పంచాయతీలో పనిచేయని సీసీ కెమెరాల స్క్రీన్

పెరుగుతున్న నేరాలు

గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరుగుతున్నాయి. గ్రామాల్లో దొంగతనాలు జరుగుతున్నా సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు దొరకకుండా తప్పించుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు ఎక్కువవుతున్నాయి. వ్యవసాయ బోర్ల కేబుల్స్ కట్ చేసుకుపోవడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగితీగలు దొంగలించడం వంటివి చాలా జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు ఉంటే ఇలాంటి చోరీలు, నేరాలను అరికట్టవచ్చని స్థానికులు అంటున్నారు.

బాగు చేయించాలి



గ్రామంలో చాలా రోజులుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పంచాయతీ అధికారులను అడిగితే తమకేమి సంబంధం లేదన్నట్లుగా సమాధానం చెబుతున్నారు. గ్రామంలో నేరాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కెమెరాలు బాగు చేయించాలి.

–కమ్మరి శ్రీనివాస్‌చారి, సురంగల్, మొయినాబాద్ మండలం

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను గతంలో సర్పంచ్‌లు చూసేవారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో నిర్వహణ సరిగా జరగడం లేదు. మొదటి ప్రాధాన్యతగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నాం. దాతల సహకారంతో గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

మొక్కుబడిగా సమావేశం

హయత్‌నగర్: సర్పంచులు లేరు..అధికారులు రారు..సమస్యల ప్రస్తావన తప్ప పరిష్కరించేవారు కరువయ్యారు. శనివారం హయత్‌నగర్‌లో అబ్దుల్లాపూర్‌మెట్టు మండల పరిషత్ సమావేశం ఎంపీపీ బుర్ర రేఖా మహేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్దుల్లాపూర్‌లో సర్వే నెంబర్ 118లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని ఎంపీటీసీ జంగయ్య ఆరోపించారు. రెండేళ్లుగా గ్రామంలో కొంతమందికి కల్యాణలక్ష్మీ పథకం అందడం లేదన్నారు. ఈ విషయంపై సమాధానం చెప్పే అధికారులే లేరు. బస్సుల్లో ఎక్కే మహిళల పట్ల ఆర్టీసీ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, బస్టాపుల్లో బస్సులను ఆపకుండా ఇబ్బందులు పెడుతున్నారని జెడ్పీటీసీ దేవదాసుగౌడ్ ఆర్టీసీ అధికారులపై మండిపడ్డారు. బస్సుల సంఖ్యను పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. రైతులకు హార్టికల్చర్ ద్వారా అమలు చేస్తున్న పథకాలను గ్రామల్లో వివరించాలని, ఆయిల్ ఫాం తోటల పెంపకంపై ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీటీ చేగూరి వెంకటేశ్ కోరారు. పలు అంశాలపై అధికారులు గణాంకాలు చదివి వినించారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి శనివారం మండల కేంద్రం నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పలు వాహనాలలో తరలివెళ్లారు. అంతకు ముందు మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో దశరత్‌నాయక్ మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం గడిచిన పది సంవత్సరాల్లో అభివృద్ధికి మారుపేరుగా నిలిచిందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేదన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, గౌరవాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు లచ్చి రామ్‌నాయక్, గోపాల్, రమేశ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, నర్సింహాగౌడ్, లోక్యానాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కడ్తాల్: పెళ్లి కానుక అందజేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



ఆమనగల్లు: మృతుని కుమారుడికి ఆర్థికసాయం అందించిన చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన శరణప్ప సంతోశ దంపతుల కూతురు స్నేహ వివాహం ఆదివారం జరుగనుంది. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఆ కుటుంబానికి రూ.21వేల ఆర్థిక సాయం చేశారు. పెళ్లి కూతురు స్నేహకు పట్టుచీర కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఆనంద్ కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, హరిచంద్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నర్సింహ, కృష్ణ, అంజి, శ్రీకాంత్, మహేశ్, గణేశ్, టీక్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

రాములు కుటుంబానికి అండగా ఉంటాం: మోహన్‌రెడ్డి

తలకొండపల్లి: రాములు కుటుబానికి అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన పెరమాండ్ల రాములు మృతిచెందిన విషయం శనివారం తెలుసుకొని మోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అందజేసిన రూ.3వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వెల్జాల్‌లో..

వెల్జాల్ గ్రామానికి చెందిన దుబ్బ పెద్దయ్య శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకొని శనివారం శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డిలు మృతున్ని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కాసు శ్రీనివాసురెడ్డి రూ.4వేలు, శ్రీనివాసుయాదవ్ రూ.3వేలు, డోకూరి ప్రభాకర్‌రెడ్డి రూ.3వేలు, మాజీ ఉప సర్పంచ్ అజీజ్ రూ. వెయ్యి, ఎంపీటీసీ అంబాజీ రూ. వెయ్యి, ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, వేణు, స్వామి, దర్శన్, శ్రీకాంత్, యాదగిరి, జాఫర్, అజీజ్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మహేశ్ తండ్రి తలారి రామలింగం శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, వైస్‌చైర్మన్ దోనాదుల సత్యం పరామర్శించారు. మృతుడు రామలింగం మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుమారుడు మహేశ్‌ను వారు ఓదార్చారు. అనంతరం మృతుని కుమారుడికి గంప వెంకటేశ్‌గుప్తా రూ.5 వేలు, దోనాదుల సత్యం రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ రమేశ్, సీఈఓ దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, సురేశ్, భాస్కర్, మహేశ్, మహేందర్, గణేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వమే

మోదీతోనే దేశ రక్షణ
- కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్యయాదవ్



బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న మర్పల్లి అంజయ్య యాదవ్

యాచారం: నరేంద్రమోదీతో దేశ రక్షణ, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వమే వస్తుందని కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో భువనగిరి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కమలంపువ్వు గుర్తుకు ఓటేయాలని కూలీలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నుంచి మంజూరు చేస్తున్న నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఉపాధి పనులు, సీసీ రోడ్లు, నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకం తదితర అభివృద్ధి పనులకు మొత్తం కేంద్రమే నిధులు ఇస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పైస నిధులు కూడా విడుదల కావడం లేదని చెప్పారు. పల్లెల అభివృద్ధికి ప్రతీ యేటా రూ. కోట్లాది నిధులు ఇస్తున్న ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, బూత్ అధ్యక్షుడు గుడాల వెంకటేశ్, శెట్టిపల్లి శివ కుమార్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు గుర్రం శైలజారెడ్డి, మర్పల్లి మల్లేశ్ యాదవ్, మసుగ్రరి శశిధర్, గుడుకుంట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాకృష్ణ స్వామి ఉత్సవాలు

కడ్తాల్: మండల పరిధిలోని బాలాజీనగర్ గ్రామ సమీపంలోని ధనరాశి గుట్టపై వెలసిన రాధాకృష్ణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం ఆలయంలో ఆరాధన, చక్రతీర్థం, మహాపూర్ణాహుతి పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, దేవత ఉద్వాసన, మహాదాశీర్వాదం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామవత్ భీక్యానాయక్, డాక్టర్ రాంచందర్‌నాయక్, మాజీ సర్పంచ్ కమ్లీ, గిరిజన గురువులు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. విద్యుత్ అంతరాయం

తుర్కయంజాల్: శనివారం ఉదయం కురిసిన అకాల వర్షం కాస్తా ఉప శమనం కలిగించింది. ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకు ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడ్డది. వర్షం వల్ల ఇండ్లల్లో ఉక్కపోత మాత్రం పెరిగింది. శుక్రవారం సాయంత్రం నుంచి కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో చాలా కాలనీల్లో అంధకారం నెలకొంది. తరుచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. తుర్కయంజాల్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ బస్తీలో 11కేవీ స్తంభం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

నిబంధనల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలి

- అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ



బాలకృష్ణ (కమిషనర్)

ఇబ్రహీంపట్నం రూరల్: నిబంధనల ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలని, వాటిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారమే ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఇప్పటికే ఆదిబట్ల మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అక్రమ నిర్మాణాలు గుర్తించి వాటికి నోటీసులు జారీ చేశామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి ఫిర్యాదు చేశామని తెలిపారు. మున్సిపాలిటీ లేదా హెచ్‌ఎండీఏ నిబంధనలు తీసుకోకుంటే మున్సిపాలిటీ చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. అలాగే వ్యాపారులు కూడా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ, సీడీఎంఏ నుంచి ఇంటి పన్నులో 5 శాతం రాయితీ కల్పించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నామన్నారు. ఈ విషయంలో పుర ప్రజలు సహకరించాలని కోరారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ గెలుపునకు కృషి

రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంచాల మండలం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కాంగ్రెస్ పాలకులు ఇచ్చిన హామీలు విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే అవినీతిమయమని పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్‌లో స్థానిక నాయకుడు క్యామ మల్లేశ్ బరిలో దిగారన్నారు. బడుగుల నేత క్యామ మల్లేశ్‌ను గెలిపించుకుందామన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి తారకరామారావు సారథ్యంలో మళ్లీ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రమేశ్, బహదూర్ నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి



మాట్లాడుతున్న మల్లు రవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పండి
- ఎంపీ అభ్యర్థి మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: లోక్‌సభ ఎన్నికల్లో దేశ అభివృద్ధికి పాటుపడుతున్న పార్టీని గెలిపించాలని నాగర్ కర్నూల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం వాసవి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పాలన్నారు. దేశ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ని గెలిపించాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటు పడే పార్టీ కాంగ్రెసేనని చెప్పారు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, తెలంగాణ అప్పుల పాలైందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని, మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడం కోసం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, కోఆర్డినేటర్ ఇందిరా శోభన్, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, యూత్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్, మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, సీనియర్ నాయకుడు రాంరెడ్డి, సంపత్, శేఖర్, శివ, దళపతి, సమీర్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు దరఖాస్తు చేసుకోండి

ఉద్యాన శాఖ అధికారి ఉషారాణి

నందిగామ: ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులు సంబంధిత ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి ఉషారాణి శనివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫామాయిల్ సాగు చేసుకునేందుకు అన్ని రకాలుగా రాయితీలను అందిస్తోందని చెప్పారు. మొక్కలకు గుంతలు తీయడానికి, డ్రిప్పు, మెయింటనెన్సుకు రాయితీలను అందివ్వడమే కాకుండా గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తుందని వివరించారు. ఆసక్తి గల రైతులు సంబంధిత ఏఈఓను సంప్రదించాలన్నారు.